


# ఏయూ లుక్స్

తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

**ANDHRA UNIVERSITY**
Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified
aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్: 0891-2844000
September 02 - 09, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan | సంపుటి : 2 | సంచిక : 82 | పేజీలు : 8


# గ్లోబల్ పౌరులుగా.. విద్యార్థులను తీర్చిదిద్దండి



- నాలెడ్జి, సామాజిక స్పృహలో మన విద్యార్థులు అంతర్జాతీయంగా నిలవాలి
- ఏయూ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- ఛాన్సలర్ హోదాలో స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్
- సాదరంగా స్వాగతం పలికిన ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి
- ముఖ్యఅతిథిగా హాజరైన జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు
- ఆచార్య ఇనాక్, డాక్టర్ ఇంద్ర కుమారులకు గౌరవ డాక్టరేట్లు ప్రధానం
- ఏయూ నిజమైన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం అంటూ.. గవర్నర్ కితాబు
- తెలుగువారి మనోభావాలకు ఏయూ ప్రతీక.. విద్యాశాఖ మంత్రి బొత్సా
- ఎన్నో విజయగాధలకు ఏయూ పుట్టినిల్లు.. జీఎం రావు
- ఏయూ అభివృద్ధిని, భవిష్యత్ విజన్‌ను వివరించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



వివరాలు 2,3లో

# ఉత్తమ బోధనా స్ఫూర్తికి వందనం

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఆరుగురు ఏయూ ఆచార్యులు**
**ఇద్దరు ఆచార్యులకు బెస్ట్ అకడమిషియన్ అవార్డులు అందజేసిన వర్సిటీ**








యువత ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసేవి విజ్ఞానం.. సామాజిక చైతన్యమే. అయితే వాటి సాకారం దిశగా యువతను ముందుకు నడిపించే గురుతర బాధ్యత మాత్రం గురువులదే. ఈ దిశగా విలువైన సేవలు అందించే ఉత్తమ గురువులను ఏటా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగం. ఏయూ ద్వితీయ ఉపకులపతి, భారత ద్వితీయ రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఈ మహాక్రతువు నిర్వహించే విషయం తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక అవార్డుల వేడుకను ఏయూ వేదికగా నిర్వహించింది. ఈ వేడుకలో ఆరుగురు ఏయూ ఆచార్యులు ఈ ఏడాది అవార్డులు అందుకున్నారు. ముగ్గురు ఆచార్యులను ఏయూ బెస్ట్ అకడమీషియన్ అవార్డులతో గౌరవించింది.

వివరాలు 4లో

# విద్యాభివృద్ధికి చేసే ఖర్చే... భవిష్యత్‌కు పెట్టుబడి

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానంలో మంత్రి బొత్స**
**ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా ఘనంగా జరిగిన వేడుక**



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాభివృద్ధికి చేస్తున్న కేవలం నిధుల ఖర్చుకాదని.. అది రాష్ట్ర భవిష్యత్‌కు పెట్టుబడి అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వేదికగా ఇటీవల రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి బొత్స ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థులు ప్రపంచస్థాయిలో రాణించేందుకు ముఖ్యమంత్రి జగన్ పాఠశాల తరువాయి 5లో



## కొలకలూరి ఇనాక్‌కు గౌరవ డాక్టరేట్



విద్యావేత్తగా, రచయితగా, సామాజిక వేత్తగా, సమాజానికి విశిష్ట సేవలు అందించిన ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు స్నాతకోత్సవం సందర్భంగా ఏయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విద్యాశాఖ మంత్రి బొత్స, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, యాప్సీ ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో ఆయన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా ఆయన ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఎస్‌వీయూ ఉపకులపతిగా ఆయన సేవలు అందించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా వేజెండ్ల, 1999 జూలై 1న ఆయన జన్మించారు. దాదాపు 42 ఏళ్లకుపైగా ఆయన బోధన రంగంలో సేవల్లో 200 రీసెర్చ్ పేపర్లు రచించారు. 24 మంది డాక్టరేట్లు, 18 మంది ఎంఫిల్ అందించారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా సామాజిక, సాహితీ రంగానికి ఎనలేని సేవలు అందించారు.

## అల్లూరి ఇంద్రకుమార్‌కు గౌరవ డాక్టరేట్



అవంతీ ఫీడ్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి ఇంద్రకుమార్‌కు ఏయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఆక్వాల్చర్ రంగంలో 30 ఏళ్లుగా ష్రింప్ ఫీడ్ మ్యానుఫాక్చరింగ్, హేచరీస్, ఫామ్స్, ప్రోసెసింగ్ రంగంలో ఇంద్ర కుమార్ విశిష్ట సేవలు అందిస్తున్నారు. ఎంతో మందికి ఉపాధిని కల్పించడంతో పాటు వ్యాపార రంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ష్రింప్ కల్చర్ ఇండస్ట్రీతో మంచి అనుభవం వున్న అల్లూరి ఇంద్రకుమార్ గతంలో మోస్ట్ ట్రస్ట్ సీఈవోగా, బెస్ట్ వాల్యూ క్రియేటర్ అవార్డులు అందుకున్నారు. సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్య క్షుడిగా, సీఆర్ రెడ్డి విద్య సంస్థలు, ఏబీవీ పీఈ రీఆర్ కళాశాలల ఛైర్మన్ వ్యవహరిస్తున్నారు. ఏయూలో అవంతి సీఫుడ్స్ రీసెర్చ్ సెంటర్ నిర్మించి విద్యార్థుల్లో నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధికి బాటలు వేస్తున్నారు. పదుల సంఖ్యలో జాతీయ స్థాయిలో అవార్డులను దుకున్నారు.

# గ్లోబల్ పౌరులుగా.. విద్యార్థులను తీర్చిదిద్దండి



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** విద్యార్థులను గ్లోబల్ పౌరులుగా తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయాలు క్రియాశీలకపాత్ర పోషించాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఏయూలో జరిగిన 87, 88, 89, 90వ సంయుక్త స్నాతకోత్సవంలో గవర్నర్ శనివారం ఛాన్సలర్ హెూదాలో పాల్గొన్నారు. తొలుతా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, స్నాతకోత్సవ ముఖ్యఅతిథి డాక్టర్ గ్రంధి మల్లికార్జునరావుల సమక్షంలో ఆచార్య కొలకలూరి ఇనాక్, డాక్టర్ ఇంద్రకుమార్‌లకు గౌరవ డాక్టరేట్‌లను అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల ఆచార్యులు విద్యార్థులు భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పూర్తి డెడికేషన్, ఎఫర్ట్ పెట్టాలన్నారు. నాలెడ్జి ఒక్కటే విద్యార్థికి ప్రధానం కాదన్న ఆయన ప్రతి విద్యార్థికి సామాజిక బాధ్యత కూడా ఉండాలన్నారు. చదువు, సామాజిక స్పృహలో మన యువత అంతర్జాతీయంగా ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం దేశంలో నిజమైన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంగా నిలుస్తుంద న్నారు. 98 ఏళ్ల పురాతనమైన ఈ విశ్వవిద్యాలయం త్వరలోనే శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనుందన్నారు. దేశంలోనే మల్టి డిసిప్లినరీ విశ్వవిద్యాలయంగా నిలుస్తుందన్నారు. ఏయూకు బలమైన పునాదులు వేసిన విజనరీ ఫౌండర్స్ ఆచార్య కట్టమంచి రామలింగారెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, డాక్టర్ వీఎస్ కృష్ణ అందించిన సేవలను కొనియాడారు. ఆచార్య సీవీ రామన్, ఆచార్య సూర్యభగవంతం, ఆచార్య సీఆర్ రావు వంటి ఎందరో శాస్త్రవేత్తలు ఏయూ ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. స్టార్టప్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఏయూ సాధిస్తున్న ప్రగతి, పరిశోధనలను అభినందించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వరల్డ్ క్లాస్ ఇన్నోవేషన్‌తో పాటు నాలెడ్జి క్రియేషన్ హబ్‌గా నిలవాలని ఆకాంక్షించారు. వర్సిటీ విద్యార్థులంతా గ్లోబల్ కల్చర్‌లో భాగం కావాలన్న ఆయన నేర్చుకోవాలన్న భావనను లైఫ్‌లాంగ్ జర్నీలా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య జీఎం రావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆచార్య కొలకలూరి ఇనాక్, అవంతి సీఫుడ్స్ అధినేత డాక్టర్ ఇంద్రకుమార్, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రారు ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ పాలక మండలి సభ్యులు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్స్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎన్.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నలుగురికి బెస్ట్ రీసెర్చర్ అవార్డులు

స్నాతకోత్సవంలో నలుగురు ఆచార్యులకు బెస్ట్ రీసెర్చర్ అవార్డులను ప్రధానం చేశారు. 2018 సంవత్సరానికిగాను ఆచార్య కె.శ్రీనివాసరావు (స్టాటిస్టిక్స్ విభాగం), 2019కి గాను ఆచార్య వి.కృష్ణమోహన్ (కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం), 2020కి గాను ఆచార్య బి.మోహన్ వెంకటరామ్ (కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం) 2021కి గాను ఆచార్య వజీర్ మహ్మద్ (సివిల్ ఇంజినీరింగ్ విభాగం)లు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. గవర్నర్ చేతుల మీదుగా స్నాతకోత్సవ వేదికపై ఈ అవార్డులు అందుకున్నారు.





## విజయగాధలు ఏయూ సొంతం..



ఎందరో మేధావులను దేశానికి అందించిన ఘనత ఆంధ్రవిశ్వవిద్యాలయం సొంతమని స్నాతకోత్సవ వముఖ్య అతిథి జీఎంఆర్ సంస్థల అధినేత జి.ఎంరావు పేర్కొన్నారు. తొలుతా ఆయన గవర్నర్ చేతుల మీదగా డాక్టర్ ఆఫ్ సైన్స్ అవార్డును అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఏయూలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత విద్యావేత్తలుగా, వ్యాపార వేత్తలుగా, మేధావులుగా, రాజకీయ వేత్తలుగా వెలుగొందారన్నారన్న ఆయన వారి విజయగాధలు ఏయూ సొంతం అన్నారు. వారి స్ఫూర్తితో ప్రస్తుత విద్యార్థులు ఫ్యూచర్ లీడర్స్‌గా ఎలివేటర్స్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మానవ మేధస్సును అధిగమిస్తోందన్నారు. ఇటువంటి తరుణంలో ప్రత్యేక నైపుణ్యాలు కలిగి ఉండాల్సిన అవసరం ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ త్వరితగతిన అందిపుచ్చుకున్న వారిదే భవిష్యత్‌లో పైచేయి అవుతుంది. ఈ శగా యువత శ్రమించాలన్నారు. 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందన్నారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఏయూ పూర్వవిద్యార్థులు తమకు తారసపడతారని జీఎంఆర్ పేర్కొన్నారు. విద్యతో పాటు విభిన్న నైపుణ్యాలను సైతం కలిగి ఉంటేనే విద్యార్థులు జేతలుగా నిలుస్తారన్నారు. ఏయూలో విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి మౌళిక వ్యాపార రంగంలో సమర్థవంతమైన వ్యక్తిగా ఎగిన ఆయన ప్రస్థానాన్ని జీఎంఆర్ వివరించారు.

## సమగ్ర అభివృద్ధి దిశగా ఏయూ అడుగులు



సమగ్ర అభివృద్ధి, ఉన్నత విద్యా నైపుణ్యం దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి వెల్లడించారు. స్నాతకోత్సవంలో ఆయన ఏయూ ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన విద్య విధానం 2020కు అనుగుణంగా విద్యార్థుల పారిశ్రామిక అనుసంధానం, నైపుణ్య వంతమైన యువ వనరుల అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆ-హబ్, ఇండస్ట్రియల్ ఛైర్స్ ఏర్పాటుతో పాటు పెటెంట్స్ దిశగా జరుగుతున్న కార్యాచరణ వివరించారు. 60 ఎకరాల వర్సిటీ నిర్మాణుష్య ప్రాంతాన్ని సుందరమైన క్రీడా మైదానంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. వర్సిటీని ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అవలంభిస్తున్నట్లు తెలిపారు.

## తెలుగువారికి ప్రతీక ఆంధ్రవిశ్వవిద్యాలయం



తెలుగు వారికి, తెలుగు వారి మనోభావాలకు ప్రతీకగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నిలిచి ందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. ఏయూ పేరు వింటేనే తెలుగు ప్రజల హృదయాలు పులకి స్తాయన్నారు. ఏయూ విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి నేడు విద్యాశాఖ మంత్రిగా స్నాతకోత్సవంలో పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. 1957లో దేశంలోనే తొలి సారిగా ఎంబీఏ కోర్సును ప్రారంభించిన ఘనత ఏయూకి దక్కుతుందన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత సి.వి రామన్ ఏయూలో పరిశోధనలు జరిపారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య రంగానికి వేలకోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నారన్నారు. విలువైన మానవ వనరులను సృష్టించడం లక్ష్యంగా విద్యకు అత్యధిక ప్రోత్సాహం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యారంగానికి, విద్యార్థుల ఉన్నతికి చేస్తున్న ఖర్చే భవిష్యత్‌లో రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని సీఎం విశ్వసిస్తున్నారన్నారు.

# కల సాకారమైన వేళ..



## 600 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రధానం
## స్నాతకోత్సవ ప్రాంగణంలో కోలాహలం

### 690 మందికి పీహెచ్‌డీలు

స్నాతకోత్సవం ద్వారా 690 మంది విద్యార్థులు పీహెచీలు, 600 మంది విద్యార్థులు మెడల్స్, ప్రైజ్ మనీలు తీసుకోనున్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారికి అసెంబ్లీ మందిరం వద్ద గౌన్లు అందుబాటులో ఉంచుతు న్నారు. స్నాతకోత్సవం వీక్షించే వారికి అసెంబ్లీ మందిరంలో ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. స్నాతకోత్సవాన్ని యూట్యూబ్ లో లైవ్ ప్రచారం చేశారు. ఈ వేదికపై నుంచి గవర్నర్ మూడు వర్సిటీ హాస్టల్స్‌ను ప్రారంభించారు.

### నా థీసిస్‌కు బంగారు పతకం వచ్చింది



"ఏడిఆర్ మెథడ్స్ ద్వారా మ్యాట్రిమోనియల్ వివాదాల పరిష్కారం" పై లా కళాశాల ద్వారా నేను పరిశోధనలు చేయడం జరిగింది. ఆచార్య ఎస్. సుమిత్ర పర్యవేక్షణలో నా పరిశోధనలు సాగాయి. నాది ఒక అనుభవిక అధ్యయనం. నా పరిశోధనల ద్వారా నేను చిన్న చిన్న సమస్యలకే వివాహ భాగస్వామ్యం రద్దు చేసుకుంటున్న వారిపై అధ్యాయనం చేశాను. ఏడిఆర్ మెథడ్స్ ద్వారా నా పరిశోధనను పూర్తి చేశాను. ఈ పరిస్థితికి గల కారణాలను పరిశోధనల ద్వారా వివరించాను. నా పరిశోధనకు బంగారు పతకం రాయడం ఆనందాన్నిచ్చింది.

**- నంబళ్ల భాగ్యలక్ష్మి,**

### గిరిజనుల అభివృద్ధికి బాటలు వేశా..



ఏయూ ఇన్వరాల్మెంట్ సైన్స్ విభాగం ద్వారా గిరిజనుల స్థితిగతులపై నేను పరిశోధనలు చేయడం జరిగింది. ఆచార్య యూబీ రెడ్డి, ఆచార్య బైరాగిరెడ్డిల పర్యవేక్షణలో జరిగిన నా పరిశోధనలకు గాను 2021లో ఏయూ నాకు డాక్టరేట్ ప్రకటించింది. మాది విజయనగరం జిల్లా కోనూరు. ప్రస్తుతం జరిగిన స్నాతకోత్సవంలో ఈ డాక్టరేట్ను అందుకున్నాను. నా పరిశోధనల ద్వారా గిరిజనుల అభివృద్ధి మార్గాలను సూచించడం జరిగింది. గిరిజనుల సమగ్ర, సుస్థిర అభివృద్ధికి బాటలు వేయడం నాకు ఆనందానిచ్చింది.

**- డాక్టర్ ఎం.రాజగోపాల్నాయుడు**





### మా తండ్రి అంకితమిస్తున్నా..



ఎకనామిక్స్ విభాగం 2018- 20 బ్యాచ్ "నాకు స్వర్ణ పథకాల రావడం పట్ల నాకు ఎంతో ఆనందంగా ఉంది". మా నాన్నగారు నన్ను చిన్నప్పటి నుంచి చదువు కోసం ఎంతో ప్రోత్సహించారు. నేను యూనివర్సిటీ వరకు వచ్చి ఎకనామిక్స్ విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించానంటే దానికి మా నాన్నగారి ప్రోత్సాహమే కారణం. విద్యపై ఉన్న మమకారంతో ఎంతగానో నన్ను ముందుకు నడిపించారు. నా ఉన్నతకి సహకరించిన మా అధ్యాపకులకు, మా స్నేహితులకు, నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈరోజు నా విజయాన్ని మా నాన్నగారికి అంకితం ఇస్తున్నాను. ఆయన ముందు అవార్డు స్వీకరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. **- కే రామకృష్ణ**

### చాలా ఆనందంగా ఉంది,,



నేను ఎస్ కోట మండలం నుంచి వచ్చాను. ఏయూలో జియో ఫిజిక్స్ పీజీ కోర్సును 2021 లో పూర్తి చేయడం జరిగింది. ఉత్తమ మార్కులతో కోర్సు పూర్తిచేసి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యాను. నా చదువు విషయంలో అధ్యాపకులు, నా మిత్రులు, నా కుటుంబ సభ్యులు ఎంతగానో ప్రోత్సహించారు. వారందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను. వీరందరూ నా విజయంలో భాగమని భావిస్తున్నాను. స్నాతకోత్సవం ద్వారా అవార్డును అందుకోవడం ఆనందంగా భావిస్తున్నారు.

**- ఎం. పావని**

### భువనచంద్ర కథా సాహిత్యంపై..



మాది శ్రీకాకుళం జిల్లా పలాస దరి కలజాడ. ఏయూ తెలుగు విభాగం ద్వారా ఆచార్య యోహాన్ బాబు పాటు పర్యవేక్షణలో జరిగిన పరిశోధనలకు గాను 2018లో ఏయూ నాకు డాక్టరేట్ ప్రకటించింది. ఆ డాక్టరేట్ పట్టాను ప్రస్తుత స్నాతకోత్సవంలో తీసుకోవడం ఆనందంగా ఉంది. సినీ గేయరచయిత భువనచంద్ర కథాసాహిత్యంపై నేను పరిశోధనలు చేశాను. ఆయన రాసిన 870 సినిమా పాటలు కాకుండా కథా సాహిత్యంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పొందడం సంతృప్తినిచ్చింది.

**- డాక్టర్ వి. హేమసుందర్రావు**

### కుటుంబమంతా సంతోషం..



కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా చేసిన పరిశోధనలకు గాను 2020లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నాకు డాక్టరేటు ప్రకటించింది. మిషన్ లెర్నింగ్ అంశంలో ఆచార్య లావణ్యదేవి పర్యవేక్షణలో నా పరిశోధనలు సాగాయి. ప్రస్తుతం స్నాతకోత్సవం ద్వారా కుటుంబ సభ్యుల సమక్షంలో ఏయూ ఉన్నతాధికారుల నుంచి ఈ డాక్టరేట్ పట్టాను ఆందుకోవడం ఆనందంగా ఉంది. నేను డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు సైతం అభినందలు తెలియజేశారు.

**- డాక్టర్ నీలాపు రమేష్**

### బెస్ట్ థీసెస్ అవార్డు అందుకున్నా..



మాది గుంటూరు జిల్లా బాపట్ల దరి గోపాపురం. ఆంధ్రవిశ్వవిద్యాలయం సంస్కృతం విభాగం ద్వారా నేను చేసిన పరిశోధనలకు గాను ఏయూ నాకు డాక్టరేట్ ప్రకటించడం జరిగింది. ఆచార్య గాయత్రిదేవి పర్యవేక్షణలో పరిశోధనలు జరిగాయి. ఇందులో భాగంగా నా పరిశోధనకు బెస్ట్ థీసెస్ అవార్డు లభించడం ఆనందాన్నిచ్చింది. ప్రస్తుతం జరిగిన స్నాతకోత్సవం ద్వారా ఈ అవార్డు పట్టాను అందుకోవడం మధురానుభూతిని ఇచ్చింది.

**- డాక్టర్ టి.శిరిష కుమార్**

### మరిచిపోలేని అనుభూతి..



ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి స్నాతకోత్సవం ద్వారా డాక్టరేట్ అందుకోవలన్నది ప్రతి పరిశోధక విద్యార్థి కల. ప్రస్తుతం ఆ కల నేరవేరడం పట్ల నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రతిష్టాత్మక ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ఈ డాక్టరేట్ను అందుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభూతిగా భావిస్తున్నాను. ఏయూ ఆంగ్ల విభాగంలో ఆచార్య టి.నారాయణ పర్యవేక్షణలో నా పరిశోధనలు సాగాయి. పాలిటెక్నిక్ స్టూడెంట్స్ రైటింగ్ స్కిల్స్ అంశంలో నా పరిశోధనలు జరిగాయి. నా ఉన్నతకి సహకారం అందించిన మా ఆచార్యులకు, సిబ్బందికి దన్యవాదాలు.

**- డాక్టర్ ఎన్.గుణదేవి**

# ఉత్తమ బోధనా స్ఫూర్తికి వందనం

**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులను వరించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకొని ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించే విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయ ప్రముఖులను జాబితాను గతయ వారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఆరుగురు ఏయూ ఆచార్యులు ఈ అవార్డులను ఎంపికవ్వగా ఇటీవల ఏయూ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం గురుపుజోత్సవ వేడుకల్లో ఆచార్యులు ఈ అవార్డులను అందుకున్నారు. రాష్ట్ర మంత్రులు బొత్సా సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో అవార్డులు అందజేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అర్ట్స్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, న్యాయ కళాశాలకు చెందిన ఆచార్య కె.సీతామాణిక్యం, సైన్స్ కళాశాల మెటరాలజీ, అండ్ ఓషనోగ్రఫీ విభాగానికి చెందిన ఆచార్య సీవీ నాయుడు, కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆచార్య పి.శ్యామల, ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్య కె.రమాసుధ , కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆచార్య డి.లలితాబాస్కరిలు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వారిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతకు ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామల రావు, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ పక్రాశ్, కలెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు వర్సిటీ ఉన్నతాధికారులు అవార్డులకు ఎంపికైన ఆచార్యులకు అభినందనలు తెలియజేశారు. ఆరుగురు వర్సిటీ ఆచార్యులు ఈ ఏడాది అవార్డు ఎంపికకావడం గర్వకారణమని, వీరి స్పూర్తితో వర్సిటీ ఆచార్యులు విలువైన సేవలు అందించాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.

## ముగ్గురికి సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డుల ప్రధానం

### బెస్ట్ అకడమీషియన్ అవార్డులను అందించిన వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రతీ సంవత్సరం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని బోధన, పరిశోధనల్లో విశిష్ట కృషిచేస్తున్న ఆచార్యులకు అందించే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డ్‌లను ఈ ఏడాది ముగ్గురికి ఆచార్యులు అందుకున్నారు. 2023 సంవత్సరానికి బెస్ట్ అకడమీషియన్ అవార్డులను ఏయూ ఫార్మశీ కళాశాలకు చెందిన వి.గిరిజాశాస్త్రి, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఈసిఈ విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, మేథమేటిక్స్ విభాగాధిపతి ఆచార్య జి.నానాజి రావులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఇటీవల అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్స్ ఆచార్య కె.శ్రీనివాస రావు, జి.శశిభూషణ రావు, వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఏ.కె.ఎం పవార్ తదితరులు పాల్గొన్నారు.




### అవార్డు అందుకోవడం ఆనందగా ఉంది

ఆంధ్రవిశ్వవిద్యాలయానికి, విద్యార్థులకు అందించిన సేవలకు గాను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల ఆనందంగా ఉంది. ప్రతి ఆచార్యుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవాలనే ఆకాంక్ష ఉంటుంది. అది నా విషయంలో సాకారమయ్యింది. ఇప్పటి వరకు కంప్యూటర్ సైన్స్ విభాగం ద్వారా 3 పుస్తకాలు రాయడంతో పాటు 74 పబ్లికేషన్స్ చేయడం జరిగింది.



**– ఆచార్య డి.లలితాబాస్కరి**

### మరింత బాధ్యత పెరిగింది

ఉత్తమ ఉపాధ్యా అవార్డు అందుకోవడం ద్వారా ఆచార్యురాలిగా మరింత బాధ్యత పెరిగింది. విద్యార్థుల అభ్యోన్నతికి మరిన్ని విశిష్ట సేవలు అందించాల్సివుంది. ఇప్పటి వరకు 2 బుక్స్ రాయడంతో పాటు 80 వరకు జాతీయ అంతర్జాతీయ పబ్లికేషన్స్ చేయడం జరిగింది. రానున్న రోజుల్లో విద్యార్థుల భవిష్యత్‌తో పాటు వర్సిటీ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాల్సివుంది. **– ఆచార్య కె.రమాసుధ**



### వర్సిటీ ప్రోత్సాహంతో సాకారం

ఏయూ కెమిస్ట్రీ విభాగం ద్వారా విద్యార్థుల వికాసానికి 2006 నుంచి సేవలు అందిస్తున్నాను. ఇప్పటి వరకు 32 మంది విద్యార్థులు నా పర్యవేక్షణలో పీహెచ్‌డీ అవార్డులు అందుకున్నారు. 110 జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్స్ చేయడం జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ఆనందంగా ఉంది. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిగారితో పాటు వర్సిటీ యంత్రాంగం ప్రోత్సాహంతో ఇది సాకారమయ్యింది.



**– ఆచార్య పి.శ్యామల**

### సేవలకు గుర్తింపు ఆనందాన్నిచ్చింది

29 ఏళ్లుగా ఆచార్యుడిగా విద్యారంగానికి విలువైన సేవలు అందిస్తున్నాను. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ పురోగతికి విలువైన సేవలు అందించాను. ఇప్పటి వరకు నా పర్యవేక్షణ లో 30 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీలు సాధించారు. పది పుస్తకాలు రాయడంతో పాటు 50 వరకు జాతీయ అంతర్జాతీయ పబ్లికేషన్స్ చేశాను. ఈ అవార్డుతో సేవలకు గుర్తింపు లభించిందని భావిస్తున్నాను.



**– ఆచార్య ఎన్.కిషోర్‌బాబు**

### విద్యార్థుల భవిష్యత్‌కు కృషి

ఏయూ న్యాయ కళాశాల ద్వారా విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు డెడికేషన్‌తో సేవలు అందించడం జరిగింది. ఇప్పటి వరకు 12 మంది విద్యార్థులు నా పర్యవేక్షణలో పీహెచ్‌డీలు పూర్తిచేశారు. 2 పుస్తకాలతో పాటు 52 జాతీయ అంతర్జాతీయ పబ్లికేషన్స్ చేయడం జరిగింది. ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా విద్యార్థుల ఉద్యోగ ఉన్నతి సేవలు అందించాను. పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు మానవత ద్వారా సేవ కార్యక్రమాలు చేయడం జరుగుతుంది.



**– ఆచార్య కె.సీతామాణిక్యం**

### సేవలకు తార్కాణం

ఆచార్యుడిగా నా సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందించడం ఆనందంగా ఉంది. వర్సిటీకి అందించిన సేవలకు ఇది తార్కాణంగా భావిస్తున్నాను. ఇప్పటి వరకు నా పర్యవేక్షణలో 27 మంది పీహెచ్‌డీ అవార్డులు, 21 మంది ఎంఫిల్ అవార్డులు అందుకున్నారు. 76 జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్స్ చేయడం జరిగింది. దీంతో పాటు పలు అడ్మినిస్ట్రేషన్ పదవుల ద్వారా ఏయూకు అందించిన సేవలు సంతృప్తినిచ్చాయి.



**– ఆచార్య సీవీ నాయుడు**

# ఈ వారం డాక్టరేట్లు

## నిక్సన్‌కు ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి నున్న నిక్సన్‌కు డాక్టరేట్ లభించింది. సోషల్ వర్కు విభాగం ద్వారా " సస్టైనబుల్ డెవలప్మెంట్ స్ట్రాటజీస్ ఇన్ ఫిషరీస్ సెక్టార్ " ప్రోబ్లవమ్ ఆఫ్ గర్లఛైల్డ్ ఎడ్యుకేషన్ ఇన్ సెంకండరీ స్కూల్ ( ఏ స్డడీ ఆన్ రూరల్ ఏరియాస్ ఇన్ విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఆచార్య కె.విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో ఈ పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా నిక్సన్ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు నిక్సన్‌కు అభినందనలు తెలియజేశారు.

## వాణిబాలకు ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి కందికుప్ప వాణిబాలకు డాక్టరేట్ లభించింది. జంతుశాస్త్ర విభాగం ద్వారా 'ఎఫెక్ట్ ఆఫ్ ప్రోబయోటిక్ ఆన్ వాటర్ క్వాలిటి పారామీటర్స్ అండ్ వైబ్రిస ల్యాండ్స్ ఇన్ పెనామీస్ వన్నామై కల్చుం ఫండ్స్ ఫ్రమ్ విజయనగరం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇండియా' అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఆచార్య సి.మంజులత పర్యవేక్షణలో ఈ పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ రెక్టార్ ఆచార్య సమత చేతుల మీదగా వాణిబాల ఆమె కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు ఆచార్యులు, పరిశోధకులు వాణిబాలకు అభినందనలు తెలిపారు.

# మూడు కొత్త హాస్టల్స్ ప్రారంభం

**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మూడు వర్సిటీ హాస్టల్స్‌ను ప్రారంభించారు. వేదికపై ఏర్పాటు చేసిన శిలాఫలాలకు వర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో పాటు అతిథులు, ఉన్నతాధికారుల సమక్షంలో గవర్నర్ ప్రారంభించారు.



### భారత్ -ది జి 20 ప్రెసిడెన్సీ హాస్టల్.

అంతర్జాతీయ విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరం ఎదురుగా ఈ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. అంతర్జాతీయ విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేశారు. దీనిలో 44 గదులను నిర్మించారు. వర్సిటీలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటిన నేపథ్యంలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన హాస్టల్ నిర్మాణం జరిపారు.

### శతాబ్ధి క్లాసిక్ హాస్టల్...

భారత ప్రభుత్వం అందిస్తున్న నిధులతో రెండు అంతస్థుల్లో ఈ హాస్టల్‌ను నిర్మించారు. మొత్తం ఐదు అంతస్థుల నిర్మాణానికి ఉపయుక్తంగా ఫౌండేషన్ నిర్మించారు. దీనిని రూ.2 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో నిర్మాణం జరిపారు. ఈ భవనంలో 60 గదులను విద్యార్థులకు ఉపయుక్తంగా నిర్మించారు. ఈ వసతి గృహాలు అందుబాటులోకి రావడంతో వర్సిటీ విద్యార్థులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి.

### ఎం.విశ్వేస్వరయ్య హాస్టల్.

ఏయూ ఇంజీనరింగ్ కళాశాల ఆలుమ్ని సహకారంతో నూతనంగా నిర్మించిన హాస్టల్‌ను ఎం.విశ్వేస్వరయ్య హాస్టల్ సముదాయాన్ని గవర్నర్ ప్రారంభించారు. దాదాపు రూ 7.5 కోట్ల వ్యయంతో ఐదు అంతస్థుల్లో ఈ హాస్టల్ భవనం నిర్మాణం జరుగుతొంది. తొలి దశలో 3.75 కోట్లు వ్యయంతో మూడు అంతస్థుల నిర్మాణం పూర్తిచేశారు. 48 గదులుగా 150 మంది విద్యార్థులకు వసతిని అందించే విధంగా దీని నిర్మాణం జరిగింది. ఇంజనీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం స్వయంగా ఈ భవనాన్ని నిర్మించి ఏయూకు బహూకరిస్తోంది. వచ్చే సంవత్సరం మరొక రెండు అంతస్థులను నిర్మిస్తారు. ఈభవనానికి అవసరమైన యూజీడీ వ్యవస్థ, ప్రాంగణం చుట్టూ సుందరీకరణ, రోడ్లు నిర్మాణం అదనంగా చేపడుతున్నారు.



# విద్యాభివృద్ధికి చేసే ఖర్చే.. భవిష్యత్‌కు పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి

విద్యనుంచే అనేక సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు. విద్యా ప్రమాణాల పెంపునకు గత రెండేళ్లలో రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. దాన్ని ఖర్చులా కాకుండా మానవ వనరులు, వికాసాన్ని పెంచడానికి, రాష్ట్రానికి పెట్టుబడిగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి బొత్స అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 196 మందికి మంత్రి తదితరులు అవార్డులు అందజేశారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, పలువురు సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, డీఈఓ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

# యువతపైనే దేశ భవిష్యత్




**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువ తకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపు ణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత-మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సా మాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినే టర్ ఎస్. హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధి కారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



# ఆక్వారంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది

## ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆక్వారంగం శరవేగం గా అభివృద్ధి సాధిస్తున్న రంగాలలో ఒకటిగా నిలుస్తోందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఉదయం ఏయూ - అవంతి ఆక్వాకల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ష్రింప్ ఫార్మింగ్ అండ్ బెటర్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్' అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్య క్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశానికి విదేశీ మారకాన్ని తీసుకువస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటన్నారు. అదే సమయంలో ఈ రంగాన్ని అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం, ఆహారం వంటివి ఎంతో జాగ్రతలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రంగానికి నిపుణులైన మానవ వనరులు పెద్దసంఖ్య లో అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ శిక్షణకు హాజరవుతున్న వారికి ప్రత్యక్ష శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. ఏయూతో అవంతి ఫౌండేషన్ చేసుకున్న ఎంఓయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌళిక వసతులను కల్పించి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఏయూ-అవంతి ఏఎస్‌డిసి డైరెక్టర్ డాక్టర్ ఏ.కె రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచన లకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ-అవంతి ఏఎస్‌డిసి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫని ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. 20 మంది బిఎఫ్ఎస్‌సి, ఎంఎస్సీ, బిఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపి నుంచి శిక్షణకు హాజరవుతున్నా ర్నారు. శిక్షణలో భాగంగా 13 రోజులు థియరీ, 17 రోజులు ప్రాక్టికల్ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్, డాక్టర్ డి.సునీల్ కుమార్, సిహెచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏయూలో ఘనంగా గురుపూజోత్సవం

### సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసిన వీసీ ప్రసాద రెడ్డి



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఏయూ ఆర్ట్స్ కళాశాలప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, కె.శ్రీనివాస రావు, వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, కె.విశ్వేస్వర రావు, వి.విజయలక్ష్మి, డీన్‌లు, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఏయూ ఉన్నతాధికారులు, ఆచార్యులు, పరిశోధకులు, ఉద్యోగులు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.






# ఏయూ తెలుగు విభాగంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

## విద్యతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలన్న ఆచార్యులు

**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రవిశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా అచార్యులు, విద్యార్థులు డా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆచార్యులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన అభినందన సభలో తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చదువుతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలన్నారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహానుభావులు లోతైన విశ్లేషణతో, తాత్విక దృక్పథంతో భారతీయ సమాజ దార్శినికతను ప్రపంచానికి చాటారని అందుకే ఆయనను ప్రపంచ దేశాలన్ని గురుతుల్యుడిగా భావించి గౌరవిస్తున్నా రన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవటం మనందరి అదృష్టమన్నారు. మహాత్మాగాంధీ,డా బి ఆర్ అంబేద్కర్ ,మహాత్మా జ్యోతిబా పూలే,మదర్ దెరిస్సా,అబ్దుల్ కలాం లాంటి వారు సమాజాన్ని అధ్యయనం చేసి సమాజానికి ఏది అవసరమో తెలుసుకొని దానిని అందించారు కాబట్టే తరాలు మారిన తరగని వారి ఆలోచనా ఆస్తి అక్షర బద్ధమై చరిత్రలో నిలిచిపోయిందన్నారు. బుద్ధుడు, అశోకుడు లాంటి వారు రాజ్యాల వదలి మానవత్వమే ముఖ్యమని భావించి ఆ మానవత్వాన్ని అందించే సాధనం విద్య అని గ్రహించి దాని కోసం పాటుపడ్డారని తద్వారా మంచి విశ్వవిద్యాలయాల స్థాపనకు బీజం వేసారన్నారు. వారి కోవలో విద్యార్థులను తీర్చిదిద్దిన మహానుభావుడు డా సర్వేపల్లి రాధాకృష్ణన్ అని వారి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డా అయ్యగారి సీతారత్నం,డా అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డా బూసి వెంకటస్వామి,డా కట్టెపోగు రత్నశేఖర్ ,డా పెండ్యాల లావణ్య ,డా ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి),డా యల్ గిరీష్ కుమార్, పట్నాన ధర్మారావు,మొండి స్వామి, రామారావు పరిశోధక విద్యార్థులు,స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.











ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించిన 87, 88, 89, 90వ సంయుక్త స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఏయూలోని డాక్టర్ సీఆర్ రెడ్డి స్నాతకోత్సవ మందిరంలో జరిగిన ఈ వేడుకలో ఏయూ ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ ఉత్సవం ద్వారా గౌరవ డాక్టరేట్లతో పాటు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రధానం చేశారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో 600 మంది డాక్టరేట్లు, మరో 600 మంది బంగారు పతకాలు అందుకున్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన దృశ్యమాలిక ఈ చిత్రాలలో...























ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించిన 87, 88, 89, 90వ సంయుక్త స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఏయూలోని డాక్టర్ సీఆర్ రెడ్డి స్నాతకోత్సవ మందిరంలో జరిగిన ఈ వేడుకలో ఏయూ ఛాన్స్‌లర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ ఉత్సవం ద్వారా గౌరవ డాక్టరేట్లతో పాటు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రధానం చేశారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో 600 మందికి డాక్టరేట్లు, మరో 600 మంది బంగారు పతకాలు అందుకున్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన దృశ్యమాలిక ఈ చిత్రాలలో...

















Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422